క్లుప్తంగా

నేడు ఆధార్ సేవలు

మాచర్ల: స్థానిక మున్సిపల్ కార్యాలయ పరిధిలోని రూప్ వే కాలనీ వార్డు సచివాలయంలో ఆధార్ శిబిరం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు మంగళవారం తెలిపారు. బుధవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆధార్ క్యాంపులో తమ పేర్లు తప్పులు ఉన్నా, కొత్త కార్డుల కోసం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన నేడు

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కక్షిదారులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్ తెలిపారు. స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి జిల్లాపరిషత్ పాఠశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మందుబాబులకు నిలయంగా మార్కెట్ యార్డు



పిడుగురాళ్ల: మార్కెట్ యార్డు మందుబాబులకు నిలయంగా మారిపోయింది. మద్యం తాగేందుకు సరైన స్థలం ఏదైనా ఉంది అంటే అది మార్కెట్ యార్డు అనే విధంగా మార్కెట్ యార్డు తయారైంది. ఎటు చూసినా మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ కార్యాలయం, అగ్నిమాపక శాఖ కార్యాలయం, సివిల్ సప్లయిస్ గోదాము, వ్యవసాయ శాఖ కార్యాలయం, ఉద్యాన శాఖ కార్యాలయం, ఎరువులు సరఫరా చేసే కార్యాలయంతోపాటు ప్రభుత్వ హాస్పిటల్ కూడా ఈ ప్రాంతంలో ఉంది. ఈ ప్రాంతానికి రైతులు, హాస్పిటల్‌కు ప్రజలు నిరంతరం వస్తూ పోతూ ఉంటారు. అలాంటి ప్రాంతం మందుబాబులకు నిలయంగా మారితే ఎలా అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మాచర్ల రూరల్ ఎస్‌ఐగా సంధ్యారాణి



మాచర్ల రూరల్: రూరల్ ఎస్‌ఐ జి.సంధ్యారాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు టౌన్ ఎస్‌ఐ పనిచేస్తూ ఎస్పీ ఆదేశాల మేరకు విధుల్లో చేరారు. ఆమె మాట్లాడుతూ మాచర్ల మండలంలో గంజాయి, గుట్కా, మట్కా, పేకాట వంటివి, నాటుసారా తయారీ, అమ్మకాలు చేయకూడదని, అలా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

దాచేపల్లి కమిషనర్‌గా వెంకటేశ్వర్లు



దాచేపల్లి: నగర పంచాయతీ కమిషనర్‌గా జీ వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. వెలగపూడి సచివాలయంలో ఏఎస్‌ఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లుని కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఇప్పటి వరకు ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన అప్పారావు బదిలీపై సత్తెనపల్లి వెళ్లారు.

మాజీ విలేకరి మృతి



గురజాల: మాజీ విలేకరి అమిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనారోగ్యంతో మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన మృతికి పలు జర్నలిస్టు సంఘాల నేతలు నివాళులర్పించారు. శ్రీనివాసరెడ్డి ఆంధ్రజ్యోతిలో 15 సంవత్సరాలుగా విధులు నిర్వహించాడు.

పిల్లలకు ఆదరణ, రక్షణ అవసరం

సత్తెనపల్లి: పిల్లలకు ఆదరణ, రక్షణ అవసరమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉమాదేవి అన్నారు. పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి డివిజన్ స్థాయి అడ్వైజరీ అవేర్‌నెస్ ట్రైనింగ్ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శౌరిబాబు మాట్లాడుతూ జువనైల్ జస్టిస్ యాక్ట్ 2000లో వచ్చిందని, ఈ యాక్ట్ 2001 నుంచి ప్రారంభించబడిందన్నారు. పిల్లలు లేని వారికి పిల్లలను దత్తత ఇవ్వడం జరుగుతుందని, పిల్లల హక్కులు కాపాడాలన్నారు. పిల్లలకు స్వేచ్ఛను ఇవ్వాలని, చట్టాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో శ్రీలత, ఏసీడీపీవో టి.సంతోష్ కుమారి, పీవోఎన్ఐసీ కృష్ణారెడ్డి, సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ మోసాలపై విస్తృత ప్రచారం

మున్సిపల్ మాజీ చైర్మన్లు అబ్దుల్ జలీల్, కోటయ్య



మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, వేదికపై అబ్దుల్ జలీల్, కోటయ్య

మాచర్ల: రాష్ట్ర ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దాడులకు పాల్పడడం తగదని మాజీ మున్సిపల్ చైర్మన్లు అబ్దుల్ జలీల్, కామనబోయిన కోటయ్య, రాష్ట్ర ఎస్సీ విభాగం సంయుక్త కార్యదర్శి మాచర్ల సుందరయ్య విమర్శించారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు కోలా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని 31 వార్డుల్లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు సంపూర్ణమ్మ, బైరెడ్డి వరాలరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం కల్పించాలని సూచించారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన మ్యానిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు ఆవిష్కరించి నిరసన తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు భాస్కర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎరబోతుల శ్రీనివాసరావు, జి.బ్రహ్మరెడ్డి, ఎస్సీ విభాగం నాయకులు జియోన్, నాగరాజు, మహిళ నాయకులు ధనలక్ష్మి, అనంతరమ్మ, కౌన్సిలర్ సంతోష్, మైనార్టీ నాయకులు బాజీ, డాక్టర్ కరీముల్లా, నాగిరెడ్డి, యాదవ్, కొండలు, రాధ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వంటా వార్పుతో నిరసన



వంటావార్పు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం మూడో రోజు సమ్మె శిబిరం వద్ద వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... మూడు రోజులుగా ఇంజినీరింగ్ కార్మికులు నిరసన తెలియజేస్తుంటే, ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదని విమర్శించారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోగా వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూ షోకాజ్ నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరని, సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000 పెంచాలని, నైపుణ్యాన్ని బట్టి వేతనాలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు దీ కొండ వెంకటేశ్వర్లు, బత్తుల వెంకటేశ్వర్లు శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు తెలిపారు. సమ్మె శిబిరంలో ఇంజినీరింగ్ కార్మికులు వెంకయ్య, సారథి, మధుబాబు, వేముల శ్రీనివాసరావు, గాలి పవన్‌కుమార్, నాగురు, హుస్సేన్, జి.విజయ్‌కుమార్, సాగర్, శ్రీనాథ్, అమ్మరాజు శ్రీనివాసరావు, రమేష్, సురేష్, సుభాని, కొక్కెర శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రత్నబాబు, కె.తిరుపతిరావు, బాలస్వామి, వాసా ప్రతాప్ పాల్గొన్నారు.

పోలేపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ అమీర్‌రెడ్డి

దుర్గి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షం లేకపోవడం వలన పత్తి పంట రక్షణకు నీటి తడులు అందించాలని మండల వ్యవసాయాధికారి వై.అమీర్ రెడ్డి, రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పోలేపల్లిలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. పత్తి పంటకు వచ్చే పచ్చ దోమ నివారణకు ఎస్‌పేట్ 75శాతం 250 గ్రాములు లేక ఇమిడాక్లోపిడ్ 17.8శాతం ఎస్.100 గ్రాములు, థైమోతోక్షామ్ 25శాతం డబ్ల్యూజీ 80 గ్రాములు పిచికారి చేయాలని సూచించారు. స్థానిక రైతులతో కలసి పత్తి పంట క్షేత్రానికి వెళ్లి పత్తిని పరిశీలించారు. దీనిని కాపాడుకోవటానికి మైక్రో న్యూటిరింట్స్ 19.19.19. లను ఎకరాకు కిలో, లేక నానో యూరియ 0.5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ఎస్‌కే సుభాని పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలి

పిడుగురాళ్ల: స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం పట్టణ శాఖ కార్యదర్శి టి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో స్మార్ట్ మీటర్ల బిగించడాన్ని వ్యతిరేకించాలంటూ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని సీపీఎం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్మార్ట్ మీటర్ ఖరీదును ప్రజలపైనే పదివేల నుంచి పదిహేడు వేల వరకు వేసే ప్రమాదం ఉందని తెలిపారు. ఉచితమని చెప్పి నెలల బిల్లులో కలిపి వసూలు చేసే ప్రమాదం ఉందని, కాబట్టి స్మార్ట్ మీటర్‌ను అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, దీకొండ వెంకటేశ్వర్లు, కొలుకులపల్లి శేషుదానం తదితరులు ఉన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



మాచర్ల: రోటరీ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని రోటరీ క్లబ్ గవర్నర్ ఎస్.వి.రామ్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం వైభవ్ రెసిడెన్సిలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అధ్యక్షుడిగా సత్యప్రసాద్, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, కోశాధికారిగా వై.వెంకట్రామయ్య బాధ్యతలు చేపట్టారు. ఎస్.వి.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ రామకోటయ్య ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కార్యక్రమం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారని చెప్పారు. పేదలకు వైద్య సదుపాయాలు అందిస్తుందన్నారు. విద్యాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు బెంచ్‌లు, ఇతర వస్తువులు అందజేస్తున్నారని వివరించారు. పది ఉత్తమ అవార్డులు పొందినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌రావు, చెరుకూరి నరసింహారావు, జి.రామమూర్తి, ఐ.శంకర్, పఠాన్ నాగూర్‌వలి, కృష్ణకుమారి, సురేఖ, ఎ.నాగార్జునరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారుల దాడులు



పిడుగురాళ్ల: పట్టణంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. మెగా సీడ్స్ విత్తన షాపులో ఎరువులను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని కారణంగా రూ.1,11,781 విలువ చేసే ఎరువుల యొక్క అమ్మకాలు నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో విజిలెన్స్ ఏడీఏ కె.కన్నయ్య, విజిలెన్స్ సీఐ ఎస్.అపర్ణ, అచ్చంపేట వ్యవసాయ శాఖ అధికారి పి.వెంకటేశ్వర్లు, పిడుగురాళ్ల ఏఓ ఎం.సంధ్యారాణి పాల్గొన్నారు.

రైతులకు 9 గంటలు మెరుగైన విద్యుత్ సరఫరా

ఎస్ఈ డాక్టర్ విజయ్‌కుమార్



దుర్గి సబ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్ఈ

దుర్గి: ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతులకు 9 గంటల విద్యుత్‌ను అందే విధంగా చర్యలు చేపడుతున్నామని పల్నాడు జిల్లా ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దుర్గి 33/11 కేవీ సబ్ స్టేషన్, ముటుకూరు, నెహ్రూనగర్ తండా సబ్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రిప్పింగ్, బ్రేక్‌డౌన్‌లను తగ్గించి మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి చేయాలని కోరారు. ప్రతి నెలా వంద శాతం విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని కోరారు. వర్షాకాలంలో ఎటువంటి విద్యుత్ ప్రమాదాలకు లోనుకాకుండా ప్రజలను, వినియోగదారులను, రైతాంగాన్ని అప్రమత్తం చేస్తూ ఉండాలని కోరారు. ప్రధానంగా విద్యుత్ స్తంభాలపై చెట్లు, కొమ్మలు ఉంటే వాటిని నిరంతరం చూసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట మాచర్ల ఏఈ నూతలపాటి సింగయ్య, డెప్యూటీ ఏఈ ఎ.రామయ్య, దుర్గి ఏఈ ఎ.శ్రీశైలం పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల వార్డెన్‌పై విచారణ



పాఠశాలలో విచారణ చేస్తున్న డెప్యూటి డీఈఓ ఏసుబాబు, ఎంఈఓ రవికుమార్

కారెంపూడి: స్థానిక ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి వార్డెన్ శౌరీబాయిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మంగళవారం అధికారులు విచారణ నిర్వహించారు. డెప్యూటి డీఈఓ ఏసుబాబు, ఎంఈఓ రవికుమార్, సీడీపీఓ కృష్ణవేణి విద్యార్థినులను తల్లిదండ్రులను విచారించారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో శౌరీబాయి ట్యూటర్‌గా ఇన్‌చార్జి వార్డెన్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఆమె విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు తన వ్యక్తిగత విషయాలున్న వీడియోలను విద్యార్థినులకు చూపుతోందని ఈ విధంగా ఆమె అనైతిక ప్రవర్తనను బహిర్గతం చేస్తూ విద్యార్థినులకు కీడు చేస్తోందనే ఆరోపణలపై అధికారులు విచారణ చేశారు. విద్యార్థినులను తల్లిదండ్రులను అధికారులు విచారించారు. ప్రిన్సిపాల్ నయోమి ఈ విషయమై ఇచ్చిన వివరణను నమోదు చేసుకున్నారు. అలాగే ఇన్‌చార్జి వార్డెన్‌ను ఆమెపై వచ్చిన అభియోగాల విషయమై ప్రశ్నించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే మోడల్ స్కూల్ ప్రతిష్టను దిగజార్చే విధంగా గతంలో కూడా ఏడాది క్రితం కొన్ని ఘటనలు జరగడం అప్పట్లో వార్డెన్‌ను తొలగించి ఒక టీచర్‌ను సస్పెండ్ చేయడం జరిగింది. ఆ తర్వాత నియమించిన ఈ వార్డెన్‌పై కూడా అభియోగాలు రావడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాల ప్రతిష్టను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ వాసు విచారణ చేస్తున్నారు.

సీపీఐ మహాసభను జయప్రదం చేయండి

పల్నాడు జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు రామకృష్ణ




అచ్చంపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతిలో ఈ నెల 20వ తేదీన జరిగే సీపీఐ 16వ మహాసభకు అశేషంగా ప్రజానీకం తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు బైరాపట్నం రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం అచ్చంపేటలో కరపత్రాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడుతూ భారత కమ్యునిస్ట్ పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల పట్ల పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో కల్ల బొల్లి మాటలు చెప్పి అందలం ఎక్కిన ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని విస్మరించాయన్నారు. హామీలను తుంగలో తొక్కి ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తున్నాయని చెప్పారు. అనంతరం చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అచ్చంపేట మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌బుజ్జి, పట్టణ కార్యదర్శి సంపంగుల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకం తగ్గించాలి

డీఆర్సీ డీడీఏ శివకుమారి



మాట్లాడుతున్న డీఆర్సీ డీడీఏ

పెదకూరపాడు: రైతులు ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా డీఆర్సీ డీడీఏ శివకుమారి సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం తగ్గించి జీవన ఎరువుల వినియోగం పెంచాలన్నారు. మిరప, ఇతర పంటలు సాగు చేసే రైతులందరూ పీఎండీఎస్ విత్తనాలు వేసుకోవాలన్నారు. ఎరువులు, విత్తనాలు పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకుని, పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచాలన్నారు. పురుగు మందులు కూడా విచ్చలవిడిగా వాడరాదన్నారు. మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పంటల బీమా గురించి వివరించారు. డీఆర్సీ ఏవో అరుణ్ కుమారి, సర్పంచ్ గుడిపూడి రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు వై బ్రహ్మయ్య, డీసీ చైర్మన్ వి.అప్పారావు, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, రాష్ట్ర అభ్యుదయ రైతు అవార్డు గ్రహీత దర్శి శేషారావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీ

క్రోసూరు: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ వైద్య సిబ్బంది క్రోసూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ జనాభా దినోత్సవం నినాదం 'ప్రణాళిక బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఇది కేవలం మాతృత్వ సంబంధిత ఆరోగ్యానికి కాకుండా కుటుంబ సంక్షేమానికి కూడా అవసరం అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన వివాహ వయసు ఆడబిడ్డకు 21, మగ బిడ్డకు 25 సంవత్సరాలు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భూలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు

సత్తెనపల్లి: ఉద్యాన శాఖ, గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్, సాగుపై అవగాహన సదస్సు ఈ నెల 16న మధ్యాహ్నం 3 గంటలకు సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామంలో జరుగుతుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, అలాగే పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ.వెంకటరావు, గోద్రెజ్ డీజీఎం జి.మురళీధర్, సత్తెనపల్లి ఉద్యాన అధికారి ఎన్.సురేష్, గోద్రెజ్ కంపెనీ సత్తెనపల్లి ఎఫ్‌టీసీ కె.నాని హాజరవుతారన్నారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు, కొత్తగా సాగు చేయదలచుకున్న రైతులు సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యం

చిట్టా ఈశ్వరసాయి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు చిట్టా సాయి బ్రాహ్మణి



పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న నిర్వాహకులు

సత్తెనపల్లి: విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని చిట్టా ఈశ్వరసాయి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు చిట్టా సాయి బ్రాహ్మణి చెప్పారు. సత్తెనపల్లిలో చిట్టా ఈశ్వర సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని శబరిగిరి అపార్ట్‌మెంట్‌లో 24వ వార్డ్ కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ అధ్యక్షతన మంగళవారం పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి లేకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. 2013 నుంచి తన తండ్రి విజయభాస్కర్ రెడ్డి, పెదనాన్న కృష్ణ జ్వాలా రెడ్డి, బాబాయ్ బాపూజీ రెడ్డి, సోదరుడు భరద్వాజ రెడ్డిల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు, పేద పిల్లలకు ఆర్థిక సహాయం, రక్తదానం.. ఇలా అనేక సేవా కార్యక్రమాలు చేశామని చెప్పారు. సీనియర్ న్యాయవాదులు దాసరి జ్ఞానరాజ్ పాల్, మర్రి సుబ్బారెడ్డి, రాజవరపు శివనాగేశ్వరరావు, చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ విజయ్‌కుమార్‌లు మాట్లాడారు. అనంతరం ప్రతిభ గల 20 మంది నిరుపేద విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ జలీలు, తుమ్మల వెంకటేశ్వరరావు, వల్లెం నరసింహారావు, ఉల్లంగుల ప్రసాదు, పింగళి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలను కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి

సత్తెనపల్లి: మన దేశ యువతలో ఓర్పు, నేర్పు ఎక్కువగా ఉంటాయని, దానికి సంకల్ప బలం తోడైతే ఎలాంటి నైపుణ్యాలనైనా సులువుగా నేర్చుకోవచ్చని ప్రభుత్వ స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం కార్యక్రమం ప్రిన్సిపాల్ రమేష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నైపుణ్యాలను కలిగి ఉన్నప్పుడు వికసిత్ భారత్ దిశగా యువత ముందుకు సాగుతారన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ దేశ సంపద యువత అని, వారు మంచి ఆలోచన విధానంతో నైపుణ్యాలను కలిగి ఉన్నప్పుడు భవిష్యత్తు బాగుంటుందన్నారు. ముందుగా యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో బట్లూరు, శ్రీలక్ష్మీ పాలీ క్లినిక్ వైద్యులు జక్క సిద్ధార్థ, కరూర్ వైశ్య బ్యాంకు సేల్స్ అండ్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ శాఖమూరి నవ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమం తప్పక ఏఆర్‌టీ మందులు వాడాలి



లింక్ ఏఆర్‌టీ ప్లస్ సెంటర్‌లో హెచ్‌ఐవీ వైద్య పరీక్షల్లో డాక్టర్ లక్ష్మణరావు

సత్తెనపల్లి: హెచ్‌ఐవీతో జీవిస్తూ ఏఆర్‌టీ మందులు వాడే ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకుని సకాలంలో మందులు వాడటం ద్వారా ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు సోకకుండా ఆరోగ్యంగా జీవించవచ్చని సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఏరియా ఆసుపత్రిలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లింక్ ఏఆర్‌టీ ప్లస్ సెంటర్‌లో బీపీ, షుగర్, సీరం క్రియాటిన్, హెపటైటిస్ బీ, సీ తదితర ఉచిత వైద్య పరీక్షలు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఏఆర్‌టీ మందులు వాడే వారు ప్రతి ఆరు నెలలకు విధిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యశాల ఆర్ఎంఓ డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇక్కడ ప్రతి నెల వైరల్ లోడ్ సీ డీ 4, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని, ఏఆర్‌టీ మందులు వాడే వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీ బాషా మాట్లాడుతూ ప్రతి రోజు ఏఆర్‌టీ మందులు ఒకే సమయానికి వాడాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రఘునాథ్, ల్యాబ్ టెక్నీషియన్ మహబూబ్ సుబాని, స్టాఫ్‌నర్స్ అనూష, షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ రత్నకుమార్, సార్స్ సంస్థ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఆదామ్, సిబ్బంది, వీహెచ్ఎస్ ప్రతినిధి విజయ్ చందర్, హెచ్‌ఓసీ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి



పెదకూరపాడు: మండల పరిధిలోని 75త్యాళ్ళూరు పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సీమ్యాట్ లెక్చరర్, రాష్ట్ర పరిశీలకులు పి.రమేష్‌కుమార్ మంగళవారం సందర్శించారు. అటల్ ల్యాబ్, ఒకేషనల్ ల్యాబ్, పీఎం శ్రీలో జరుగుతున్న లైబ్రరీ వర్క్, రాంప్ రైలింగ్, కిచెన్ గార్డెన్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, ప్లే ఫీల్డ్ తదితర పనులు, స్కూల్ క్వాలిటీ ఎసెస్‌మెంట్ ఫ్రేమ్ వర్క్, ఎండీఎం ఇతర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను వినియోగించుకొని పాఠశాలలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు, ఏఈ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.